
# సాక్షి మంచిర్యాల

మంగళవారం । 12 । మార్చి । 2024



**'బెల్ట్' జోరు**

జిల్లాలో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. ఎనీటైం మద్యం ఏరులై పారుతోంది. అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 8లో▸

**రంజాన్ వేళలు**

మంగళ : ఇఫ్తార్ 6:26

గరిష్టం/కనిష్టం 36.0 /25.0

**వాతావరణం**

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా వేడిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### బీఆర్‌ఎస్‌ను వీడనున్న 'పురాణం'

• కాంగ్రెస్‌లో చేరికకు ఏర్పాట్లు



పురాణం సతీశ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరికకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్న నేపథ్యంలో ఆయన అదే బాటలో వెళ్లే యోచన చేస్తున్నారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ ఎమ్మెల్యేను తీసుకెళ్లాలని ప్రయత్నించినా, అందుకు ఆ ఎమ్మెల్యే సిద్ధంగా లేనట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచే తీవ్ర అసంతృప్తితో ఉన్న 'పురాణం', మంచిర్యాలలో సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చితే తనకు అవకాశం ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు. అంతకుముందు మరోమారు ఎమ్మెల్సీగా చాన్స్ ఇస్తారని అనుకున్నా దక్కలేదు. కార్పొరేషన్ పదవి సైతం ఆశించినా రాలేదు. దీనిపై అప్పట్లోనే తన అసంతృప్తి వ్యక్తపర్చారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో స్థానికులకే పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పొసగక, గత ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గ ఇన్చార్జీగా పని చేశారు. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా తూర్పు జిల్లాలో ఆయన ఐదు నియోజకవర్గాల్లో పని చేశారు. పార్టీ మార్పుపై 'పురాణం'ను ఫోనులో సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

### పతకాలు సాధించిన కానిస్టేబుళ్లు



క్రీడాకారులను అభినందిస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కానిస్టేబుళ్లు అఖిల భారత స్థాయిలో మూడు కాంస్య పతకాలు సాధించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన 72వ అఖిల భారత పోలీస్ చాంపియన్‌షిప్ వాలీబాల్ క్లస్టర్(సెపక్ తక్రా) 2024 క్వాడ్ ఈవెంట్, డబుల్ ఈవెంట్‌లలో కానిస్టేబుల్ ఏ.రాజేందర్ రెండు కాంస్య పతకాలు, క్వాడ్ ఈవెంట్‌లో కానిస్టేబుల్ తిరుమలేశ్ ఒక కాంస్య పతకం సాధించారు. కానిస్టేబుళ్లను సోమవారం బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు నారాయణదాసు, కాళిదాసు, ఆర్‌ఎస్సై శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

### మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నిక



ఓటు వేస్తున్న సభ్యుడు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ ఎన్నికలు జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 11 మంది డైరెక్టర్లకు గాను 23 మంది సభ్యులు పోటీ పడ్డారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రహస్య బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ నిర్వహించారు. 113 మంది సభ్యులకు గాను 110 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని జిల్లా సహకార శాఖ ఎన్నికల అధికారి జే.నర్సయ్య తెలిపారు. అధికంగా ఓట్లు వచ్చిన 11 మంది సభ్యులు కంపెల చిన్నయ్య, అరుగుల వెంకటేశం, ఉట్నూరి నిత్యశ్రీ, కందుల శ్రీనివాస్, శాకరావు శంకరయ్య, కల్లెడ నర్సయ్య, శాఖపురం లచ్చయ్య, కునారపు ప్రభాకర్, శివార్ల మల్లేష్, తూటి శ్రీనివాస్, చౌతి బాలరాజు, డైరెక్టర్లుగా ఎన్నికైనట్లు తెలిపారు. డైరెక్టర్ల నుంచి జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను మంగళవారం జిల్లా సహకార శాఖ కార్యాలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### రైతులు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సీసీఐకి పత్తి విక్రయించే రైతులు పోస్టల్, బ్యాంకు ఖాతాతో ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుఖాతా ఆధార్‌తో అనుసంధానం చేసుకోని పక్షంలో పత్తి అమ్మిన డబ్బులు జమ కావని తెలిపారు. పాన్‌కార్డు, ఆధార్‌కార్డుతో సమీపంలోని పోస్టాఫీసులో సంప్రదించి ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. పోస్టాఫీసు ఖాతాలను సేవింగ్ ఖాతాగా మార్చుకుని, క్రెడిట్ లిమిటెడ్ పెంచుకోవాలని, పోస్టుమాస్టర్ ధ్రువీకరించిన నకలును వ్యవసాయ మార్కెట్ కమిటీలో అందజేయాలని పేర్కొన్నారు.

# బడికీ ఉచిత విద్యుత్!



గర్మిళ్ల పాఠశాల భవనం

### బకాయిలు ఇవీ..

బిల్లులు కొంతమేరకే చెల్లిస్తుండడంతో ఏళ్ల తరబడి పేరుకు పోతున్నాయి. విద్యాశాఖ సమాచార సేకరణలో 719 పాఠశాలల్లో రూ. 1,77,07,474 విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క ఫిబ్రవరి నెల బిల్లులు రూ.6,66,487 ఉన్నట్లు లెక్క తేలింది. విద్యుత్ మీటర్లు పనిచేయకపోవడం(నాట్ ఫంక్షనింగ్), అసలు మీటర్లు లేని పాఠశాలలు 78 ఉన్నాయని తేల్చింది.

- అమలుపై ప్రభుత్వం కసరత్తు
- వివరాల సేకరణలో విద్యాశాఖ
- ప్రభుత్వ పాఠశాలల్లో కరెంటు కష్టాలు దూరం

మంచిర్యాలఅర్బన్: గృహజ్యోతి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో ఉచిత విద్యుత్ అమలుకు కసరత్తు చేస్తోంది. పాఠశాలల్లో ఫిబ్రవరి నెలలో విద్యుత్ వినియోగం, పాత బకాయిల వివరాల సేకరణలో విద్యాశాఖ నిమగ్నమైంది. రెండ్రోజుల క్రితం ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా బాధ్యత ప్రభుత్వానిదేనని, దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లలోపు ఉన్నవారికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం సర్కారు బడుల్లో అమలుకు నిర్ణయంపై హర్షం వ్యక్తమవుతోంది. అమల్లోకి వస్తే వేలాది రూపాయలు పేరుకుపోయిన పెండింగ్ బిల్లులు, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు, పునరుద్ధరణ వరకు అనే కష్టాలకు చెక్ పడనుంది.

**స్కూల్ గ్రాంట్‌లో సగం బిల్లులకే..**

బడి నిర్వహణకు మంజూరు చేసే నిధుల్లో నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ ఏడాది స్కూళ్లకు ప్రత్యేక గ్రాంట్లు మంజూరవుతాయి. విద్యార్థుల నమోదు స్లాబ్ ఆధారంగా కాంపొజిటివ్ స్కూల్ గ్రాంట్ కేటాయించారు. 1నుంచి 30 మంది విద్యార్థులుంటే రూ.10వేలు, 31నుంచి 100 మందికి రూ.25 వేలు, 101నుంచి 250 మందికి రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మందికి రూ.75వేలు, 1000 మందికి పైగా రూ.లక్ష నిధులు మంజూరు చేస్తారు. రెండు విడతల్లో మంజూరవుతాయి. ఇందులో సగం వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండగా.. మిగతావి మరుగుదొడ్ల క్లీనింగ్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు, తాగునీరు, చిన్నపాటి మరమ్మతులు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కలు, జెండా పండుగలు ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తున్నారు. వచ్చే బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వచ్చే గ్రాంట్‌లో సగం మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండడంతో రూ.వేలాదిగా బిల్లులు పేరుకుపోతున్నాయి.

### వినియోగం ఇలా..

సర్కారు బడుల్లో ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్ ఉంటుంది. ఇటీవల కొన్నిచోట్ల డిజిటల్ తెరలు ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో బిల్లులు తడిసిమోపెడు అవుతున్నాయి. విద్యుత్‌శాఖ విద్యాసంస్థలకు కేటగిరి–7 కింద పరిగణనలోకి తీసుకుని యూనిట్‌కు రూ.8.30 చార్జీలు వేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో పాఠశాలలకు వినియోగాన్ని బట్టి రూ.250నుంచి రూ.5వేలకు పైన విద్యుత్ బిల్లులు చెల్లిస్తుంటారు. విద్యాశాఖ సేకరిస్తున్న వివరాల్లో కొన్ని పాఠశాలల్లో విద్యుత్‌మీటర్ లేకపోవడం.. బిల్లు జనరేట్ కాకపోవడం వంటి విషయాలు వెలుగుచూశాయి. కొన్నింటికి విద్యుత్ సౌకర్యం లేకపోగా.. మీటరు నంబరు కేటాయించనివీ ఉన్నాయంటే పరిస్థితులు ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు.

### అమలు సబబే..



పాఠశాలలు, కళాశాలలకు ఉచితకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని సీఎం ప్రకటన సంతోషించదగిన విషయం. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్‌ను నియమిస్తామని, 2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థుల ఉద్యోగాలపై ఈ నెల 12న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం.. జీవో 317 సమస్యల పరిష్కారానికి ఏర్పా టు చేసిన కేబినెట్ సబ్ కమిటీనే ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని చెప్పారు. సంఘాలతో చర్చించి అన్ని సమస్యలు పరిష్కరించుకుందామని భరోసానిచ్చారు.

– రాజావేణు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### హర్షించదగిన విషయం..



ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలు.. అరకొర బడ్జెట్‌తో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించలేక సతమతమైన ప్రధానోపాధ్యాయులకు పెద్ద ఊరట. ఉచిత కరెంట్ అమలు చేస్తున్న నేపథ్యంలో 8నుంచి 10వ తరగతులకు మాదిరిగానే 6, 7వ తరగతులకు కూడా డిజిటల్ బోధన చేసేలా సౌకర్యాలు కల్పించాలి. స్కావెంజర్ స్థానంలో సర్వీస్ మ్యాన్‌ను నియమించడం హర్షించదగిన విషయం.

– బన్న రవీందర్, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### కరెంట్ కష్టాలు దూరం



ప్రభుత్వ పాఠశాలల్లో కరెంట్ కష్టాలు దూరం కానున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికుల నుంచి ప్రతీ ఉద్యోగికి మొదటి తారీఖన జీతాలు చెల్లిస్తామన్నారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం, సమగ్రశిక్ష, కేజీబీవీల్లో మినిమం టైంస్కేల్, మోడల్ స్కూల్ ఉద్యోగులకు 010 మొదలగు సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం.

– సూరినేని గంగాధర్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి

# అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- పెండింగ్‌లో పెట్టరాదు
- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, పక్కన ఆర్డీవో

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో పెట్టరాదని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి అర్జీలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజావాణిలో, జిల్లా కేంద్రం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

- సేవాలాల్ మహరాజ్ మందిర నిర్మాణానికి బెల్లంపల్లి పట్టణంలోని సర్వే నంబరు 170/1లో 20గుంటల స్థలం కేటాయించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్, గణేష్, శ్రీనివాస్, రాజునాయక్ కోరారు.
- బెల్లంపల్లి బూడిదగడ్డ బస్తీలో ఇళ్ల మధ్యలో ఉన్న రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బస్తీకి చెందిన జే.లక్ష్మినారాయణ ఫిర్యాదు చేశారు.

### కబ్జాపై చర్యలు తీసుకోవాలి



బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి సర్వే నంబరు 170, బుధాకలాన్ శివారులోని విలువైన ప్రభుత్వ భూమి ఐదెకరాలు భూలక్ష్మి, మహాలక్ష్మి, ఎల్లమ్మ గుడి ప్రాంతాన్ని బెల్లంపల్లికి చెందిన మొహమ్మద్ అబ్దుల్‌బాబా కబ్జా చేశారు. పలుమార్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాం. విచారణ జరిపి ప్రభుత్వ భూమి ని కాపాడి కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలి.

– మొహమ్మద్ మహెబూబ్, బెల్లంపల్లి

### నష్టపరిహారం ఇప్పించాలి



కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామంలో సింగరేణి ఓపెన్‌కాస్టు వల్ల ముంపునకు గురైన ఇళ్లకు నష్టపరిహారం ఇంకా ఇవ్వలేదు. ఓసీ పనులు ఐదేళ్లుగా జరుగుతున్నా పరిహారం అందించలేదు. ఇళ్లు కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చింది. కిరాయి ఇళ్లలో ఉండలేక ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా పరిహారం అందించి ఆదుకోవాలి. – కొయ్యడ శ్రీనివాస్, గ్రామం: దుబ్బగూడెం, మం: కాసిపేట

### విధులకు రావద్దంటున్నారు..



బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నర్సరీ గార్డులుగా 15మందిమి గత నాలుగేళ్లుగా పనిచేస్తున్నాం. గత నవంబర్ నుంచి వేతనాలు ఇవ్వక పోగా జనవరి నుంచి విధులకు రావద్దని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ చెప్పారు. మా కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది. పెండింగ్ వేతనాలు చెల్లించి విధుల్లోకి తీసుకోవాలి. – బెల్లంపల్లి మున్సిపాలిటీ నర్సరీ గార్డులు

### తాగునీటి కోసం మహిళల నిరసన

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో తాగునీటి కోసం సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నీరందించే బోరుబావి మోటారు చెడిపోయి దాదాపు 16రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పక్కవీధిలోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. వేసవి ఎండలు దంచి కొడుతుండడంతో నీటి అవసరాలు పెరిగినట్లు తెలిపారు. అధికారులు స్పందించి బోరుబావికి మరమ్మతులు చేపట్టాలని, ఇంటింటికీ నీరందించాలని డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

# నేటి నుంచి రంజాన్ మాసం

- మంగళవారం తొలి ఉపవాసం
- దర్శనమిచ్చిన నెలవంక
- నెల రోజులపాటు ఉపవాసాలు



ప్రత్యేక ప్రార్థనలకు చెన్నూర్ మసీద్‌లో ఏర్పాట్లు

నెన్నెల/ఉట్నూర్‌రూరల్: ఆకాశంలో సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో రంజాన్ మాసం మొదలైంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా, కఠోర నియమాలతో ఆహార పానీయాలు ముట్టుకోకుండా నెల రోజులపాటు ఆచరించే రంజాన్ ఉపవాసాలు జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం తెల్లవారు జాము నుంచి మొదటి ఉపవాస దీక్షకు ముస్లింలు సిద్ధమయ్యారు. సోమవారం రాత్రి నుంచే మసీదుల్లో ఖురాన్ పఠనం, తరావీ నమాజ్‌లు ప్రారంభమయ్యాయి. పవిత్ర మాసంలో నమాజ్‌ల కోసం మసీదులను జిల్లాలో ముస్తాబు చేశారు. వేకువ జామున ఉపవాస దీక్ష(సహర్) ప్రారంభించి సాయంత్రం దీక్ష విడిచే సమయం(ఇఫ్తార్) కోసం పట్టణాల్లో ప్రత్యేక వంటకాలు అందించడానికి హోటళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇలా 30 రోజులపాటు ఉపవాసాలు ఆచరించి మళ్లీ సాయంత్రం ఆకాశంలో నెల వంకను చూసి మరుసటి రోజు ఉదయాన్నే రంజాన్ పండుగను జరుపుకుంటారు.

**అతి పవిత్ర మాసం**

ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. దివ్య ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని విశ్వసిస్తారు. ఈ నెలలో ఉపవాసాల ద్వారా శరీరాన్ని శుష్కింపజేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుందని నమ్ముతారు.

**ప్రత్యేక నమాజ్‌లు**

ప్రతీ రోజు రాత్రి 8.30గంటల నుంచి 10గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్‌లు చేస్తారు. దివ్య ఖురాన్‌ను రోజుకు 20రకాతుల చొప్పున తరావీ నమాజ్‌లో 27 రోజులపాటు హాఫీజ్‌లు పాటిస్తారు. రంజాన్‌లో రాత్రి పూట ఇషా నమాజ్ అనంతరం తరావీ నమాజ్ జరుగుతుంది. ఇలా 25రోజుల తరావీ నమాజ్ తర్వాత 26వ రోజు సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈద్ ఉల్ ఫితర్ వరకు ఉపవాస దీక్ష ఆచరిస్తారు. ఇహ లోకంలో ఆచరించే ఈ కఠోర దీక్షలు పరలోకంలో రక్షణగా ఉండి కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

### పవిత్ర మాసం



ఈ మాసంలో నాలుగు ప్రత్యేకతలు ఉన్నాయి. ఉదయం నుంచి సా యంత్రం వరకు నియమ నిష్టతో ఉపవాసం ఉండడం, ఖురాన్ చదవడం, సంవత్సరంలో సంపాదించిన ఆదాయంలో ఫిత్ర, జకాత్ బీదవారికి అందించడం, బీదవారికి రంజాన్ మాసంలో సహాయం అందించడం వంటి కార్యక్రమాలు అధికంగా చేస్తుంటారు.

– హాఫీజ్ మహ్మద్ మోయినొద్దీన్, ఉట్నూర్

### నియమ నిష్టలతో ప్రార్థనలు



రంజాన్ మాసం చాలా దైవంతో కూడిన మాసం. ఇందులో నియమ నిష్టలతో ప్రార్థనలు, అన్ని విధాలుగా నెలపాటు కఠోర దీక్షలు చేపడితే దేవుడు తన దగ్గరి వాడిగా చేసుకుంటాడు. రంజాన్ నెలలో పని మనిషి కష్టాలను యజమాని దూరం చేసినట్లయితే దేవుడు ఆయన తప్పులను క్షమించేస్తాడు. ప్రతీయేడు ఈ పండుగను ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి చేసుకోవడం ఆచారంగా వస్తోంది.

– రిజ్వాన్‌మౌలానా, సఫాబైతుల్ మాల్ మండల అధ్యక్షుడు, ఉట్నూర్

# విచారణ షురూ!

- జంగ్ సిపాయి భూ అక్రమాలపై సీరియస్
- రెవెన్యూ, ఇంటెలిజెన్స్ అధికార వర్గాల ఆరా
- చర్యలు తీసుకునేందుకు ఆధారాల సేకరణ
- 'బీఆర్‌ఎస్'ను వీడేందుకు వేగంగా 'దొర' ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జంగ్ సిపాయి భూముల అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టడంతో అక్రమాలు చేసిన 'దొర' చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. మందమర్రి మండలం అందుగులపేట శివారులో జంగ్ సిపాయి భూముల అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లాతోపాటు రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదులు వెళ్లడంతో ఆ మేరకు విచారణ జరుగుతోంది. సరైన ఆధారాలు, వివరాలు తీసుకుని చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇవే కాకుండా వేమనపల్లి మండలం లక్ష్మిపూర్, కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో వందల ఎకరాల్లో 'ఆగ్రో ఫాం' పేరుతో భూములు ఉన్నాయి. జగిత్యాల జిల్లాతోపాటు హైదరాబాద్‌లోనూ భూ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా..**

జంగ్ సిపాయి భూముల పట్టాల మార్పుపై ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ఆరా తీశారు. ఎస్పీ స్థాయి అధికారి దృష్టి సారించి వివరాలు తీసుకున్నట్లు సమాచారం. అయితే భూములు కారుచౌకగా కొట్టేసి భారీ మొత్తంలో సోలార్ కంపెనీకి అమ్మేసిన 'దొర'పై అటు జగిత్యాల జిల్లా, ఇటు మంచిర్యాల జిల్లాలోనూ విచారణ సాగుతోంది. అప్పటి ఏసీపీ బదిలీ వ్యవహారంపైనా, నాటి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల పాత్రపైనా కూపీ లాగుతున్నారు. అంతేగాక సోలార్ కంపెనీ యాజమాన్యం పొందిన సబ్సిడీలపై విచారణ జరగనుంది.

**ఖరీదైన కార్లు కొనిచ్చి..**

దళిత ఎమ్మెల్యేలకు ఖరీదైన కార్లు, అవసరాలకు డబ్బు ఇస్తూ కావాల్సిన పని చేయించుకోవడంలో 'దొర'గా పిలిచే జగిత్యాల జిల్లా పరిధి మాజీ ఎంపీపీ సిద్ధహస్తుడిగా పేరొందారు. గత సర్కారులో ఓ మంత్రికి కారు కొనిచ్చి ఆయన హోదా 'స్టిక్కర్లు' సైతం తన కార్లకే వాడుకునే చొరవ ఉండేది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గెలిచిన ఓ దళిత ఎమ్మెల్యేకు కారు కొనిచ్చానని ప్రచారం చేసుకుంటున్నాడు. మరోవైపు బీఆర్‌ఎస్‌లో ఉండి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి అసెంబ్లీ ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారంలో ఉంది. ప్రస్తుతం ఆ ఎమ్మెల్యే అండతోనే భూ దందాలపై చర్యలు తీసుకోకుండా ఖరీదైన బహుమతులు, ఖర్చులకు చూసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ పెద్దపల్లి 'ఎంపీ' టికెట్ కోసమే అధికార పార్టీలో చేరిన ఓ గులాబీ 'నేత'ను సైతం గెలిపించుకుని భవిష్యత్‌లో తన అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రణాళిక వేశారు. కానీ ఆయనకు టికెట్ వస్తుందో రాదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇక తన అక్రమాలపై చర్యలు తీసుకోకుండా రాష్ట్ర అధికార పార్టీ కండువా కప్పుకోవాలని గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఆయన పార్టీలో చేరికకు అభ్యంతరాలు రావడంతో బ్రేక్ పడుతున్నట్లు సమాచారం.

### రెవెన్యూ రికార్డుల పరిశీలన

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మందమర్రి మండల రెవెన్యూ అధికారులు ఈ మేరకు భూముల వ్యవహారంపై రికార్డులు పరిశీలిస్తున్నారు. జంగ్ సిపాయిలకు భూములు ఎప్పుడు కేటాయించారు..? ఇన్నాళ్లు ఎవరి కబ్జాలో ఉన్నాయి..? ప్రస్తుత పరిస్థితి, తదితర వివరాలు తమ పరిధిలో ఉన్న రికార్డులు, పహాణీలు తీసుకుంటున్నారు. దీనిపై ప్రాథమికంగా పలు వివరాలు సేకరించారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నారు. జంగ్ సిపాయి భూములపై విచారణ చేపట్టామని, ఆ మేరకు ప్రాథమిక విచారణ పూర్తి చేశామని తహసీల్దార్ చంద్రశేఖర్ 'సాక్షి'కి తెలిపారు.

# మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- మంచిర్యాల బల్దియా బడ్జెట్ రూ.59.19 కోట్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, పన్నులు వందశాతం వసూలుతోపాటు ట్రేడ్ లైసెన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపాలిటీలో బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్మన్ రావుల ఉప్పలయ్య ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్‌ను రూ.59.19 కోట్లుగా ఆమోదం తెలిపారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, వైస్ చైర్మన్ సల్ల మహేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**వార్షిక బడ్జెట్ ఆమోదం**

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు.కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.సతీష్, చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత హాజరయ్యారు. జేఏఓ సీహెచ్.అనితాదేవి 2024–2025 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ.24.44 కోట్ల బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ఆర్‌ఓ సతీష్, ఏఈ మధు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి


శేఖర్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): మెట్లపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఇంద్రానగర్ కాలనీకి చెందిన పెందూర్ శేఖర్ (32) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి పక్కనే ఉన్న బాత్‌రూంకు వెళ్లాడు. అనంతరం ఇంట్లోకి వచ్చే క్రమంలో మెట్లవద్ద తడబడి పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. అతని భార్య పెందూర్ విద్య గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి 7 నెలల బాబు ఉన్నాడు. మృతుని తండ్రి పెందూర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### వీధి శునకాలకు చర్మవ్యాధులు


వ్యాధి సోకిన శునకం

నెన్నెల(బెల్లంపల్లి): వీధి శునకాలకు చర్మ వ్యాధులు సోకడంతో మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు వెయ్యికి పైగా వీధి శునకాలు ఉండగా 90 శాతం చర్మవ్యాధులతో బాధపడుతూ కనిపిస్తున్నాయి. వ్యాధిసోకిన కుక్కల చర్మం మొత్తం ఊడిపోయి ఎర్రగా దద్దులు వచ్చి భయంకరంగా కనిపిస్తున్నాయి. ఈ వ్యాధి మనుషులకు సోకక ముందే అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై నెన్నెల పశువైద్యాధికారి దిలీప్‌ను సంప్రదించగా వీధి శునకాలకు డీవార్మింగ్ చేయకపోవడం వల్లే చర్మ సంబంధిత వ్యాధులకు గురవుతున్నాయన్నారు. మనుషులకు దీంతో ఎలాంటి ప్రమాదం లేదని, స్కెబిస్, మెంజీ రకానికి చెందిన అంటువ్యాధి అని, శునకాలను ఆస్పత్రికి తీసుకువస్తే చికిత్స అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. చర్మవ్యాధులకు సంబంధించిన మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు.

### దోపిడీ దొంగల మరోదాడి

మంచిర్యాలక్రైం: రైల్వేస్టేషన్ ప్రాంతంలో దోపిడీ దొంగలు వరుస దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల హమాలివాడకు చెందిన ప్రభాకర్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మరువకముందే ఆదివారం రాత్రి ఓ అటవీశాఖ ఉద్యోగిపై దాడి చేసి బ్యాగు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మంచిర్యాలకు చెందిన తాటికొండ అనిల్ కుమార్ కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ అటవీ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని రైలుమార్గం గుండా మంచిర్యాలకు చేరుకున్నాడు. రాత్రి 11 గంటలకు హమాలివాడ సూర్యనగర్‌లోని తన ఇంటికి వెళ్తుండగా మూడో ప్లాట్‌ఫాం శివారులో ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడిచేసి బ్యాగు ఎత్తుకెళ్లారు. బ్యాగులో అటవీ శాఖ కార్యాలయానికి చెందిన ముఖ్యమైన ఫైళ్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విషయమై ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



# 'బెల్ట్' జోరు..


ఏసీసీ సమీపంలోని హోటల్‌లో పట్టుకున్న మద్యంతో పోలీసులు (ఫైల్)

- జిల్లాలో గల్లీగల్లీకి షాపుల దందా
- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- మామూళ్లతో సరిపెట్టుకుంటున్న అధికారులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. ఎనీటైమ్ మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించాల్సి ఉండగా మద్యం దుకాణాలు 11 గంటల వరకు, బార్లు 12 గంటల వరకు తెరిచి ఉంచుతున్నారు. ఎక్సైజ్ అధికారుల అండదండలతో గల్లీకి ఒకటి నుంచి రెండు మూడు బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పట్టణాలు, గ్రామాల్లోనూ కొత్తకొత్త బెల్ట్‌షాపులు ఏర్పాటు చేస్తున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు అక్రమ దందాలపై ఉక్కు పాదం మోపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ రెండేళ్లుగా మొద్దునిద్ర పోతోందన్న ఆరోపణలున్నాయి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి టాస్క్ ఫోర్స్ పోలీసులు మళ్లీ రంగంలోకి దిగి విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు**

జిల్లాలోని బెల్టుషాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కింగ్‌ఫిషర్ బీరు ఎమ్మార్పీ రూ.150 ఉంటే బెల్ట్‌షాపులో రూ.250, రాయల్‌స్టాగ్ క్వాటర్ రూ.220 ఉంటే బెల్ట్ షాపుల్లో రూ.300లకు విక్రయిస్తున్నారు. పైగా మద్యం కల్తీ చేసి అమ్ముతున్నారని ఆరోపణలున్నాయి. గల్లీగల్లీకి ఉన్న బెల్ట్‌షాపుల్లో ఎనీటైమ్ మద్యం లభించే విధంగా ఎక్సైజ్, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. హమాలివాడ, గోపాల్‌వాడ, రాజీవ్ నగర్, తిలక్ నగర్, ఎన్టీఆర్‌నగర్, ఏసీసీ ప్రాంతాల్లో బెల్ట్ షాపు నిర్వాహకులపై స్థానికులు తిరగబడడంతో అధికారులకు మామూళ్లు ఇస్తున్నాం.. మీ దిక్కున్న చోట చెప్పుకొమ్మని బెదిరింపులకు పాల్పడడం గమనార్హం. పైగా మద్యాన్ని కల్తి చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. పలు మార్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చిన స్పందించక పోవడంపై సర్వత్ర విమర్శలకు తావిస్తోంది.

**'కిరాణం' మాటున మద్యం విక్రయాలు**

వాడల్లో వెలిసిన పాన్‌షాపులు, కిరాణం దుకాణాలు, హోటళ్లలో రహస్యంగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం అమ్మకాల మీద ఎక్కువ డబ్బులు రావడంతో చాలామంది యువత బెల్ట్ షాపులు నిర్వహించేందుకు మార్గం ఎంచుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గల్లీకి రెండు నుంచి మూడు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామ పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకు టెండర్లు నిర్వహిస్తున్నారు. టెండర్ దక్కించుకున్న ఒక్కరికి మాత్రమే గ్రామంలో బెల్ట్‌షాపు నడుపుకునేందుకు అవకాశం ఉంటుంది.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**



నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరిపిన వైన్స్ దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయించినా, కల్తీ జరిగినట్లు తెలిసినా ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– కేజీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

# అంతటా ఇన్‌చార్జీలే..


ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

- 8 డివిజన్లలో ఒక్కచోటనే రెగ్యులర్ ఏటీడీవో
- ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది డివిజన్లు ఉండగా ఐటీడీఏ పరిధిలో 133 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 77 బాలుర ఆశ్రమ పాఠశాలల్లో 20 వేల మంది విద్యార్థులు, 56 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థినులు ఉన్నారు. పాఠశాలల పర్యవేక్షణ కోసం ప్రతీ డివిజన్‌కు ఒకరు ఏటీడీవోలు ఉండాలి. కానీ గత మూడేళ్ల నుంచి రెగ్యులర్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

**ఎనిమిదిలో ఒక్కరే రెగ్యులర్..**

ఏటీడీవోలు తమ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రధానంగా విద్యార్థుల విద్యాబోధన, మెనూ, ఆరోగ్యంతోపాటు ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా పాఠశాలకు వస్తున్నారా.. సమయపాలన పాటిస్తున్నారా లేదా వంటివి పర్యవేక్షించాలి. ఇదిలా ఉండగా, ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ డివిజన్లు ఉండగా అన్నిచోట్ల ఇన్‌చార్జీ ఏటీడీవోలే ఉన్నారు. ఒక్క ఆసిఫాబాద్ డివిజన్‌కు మాత్రమే రెగ్యులర్ ఏటీడీవోగా ఉన్నారు. జైనూర్, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి డివిజన్లలో ఆయా పరిధిలోని హెచ్‌డబ్ల్యూవోలే ఇన్‌చార్జీ ఏటీడీవోలుగా కొనసాగుతున్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులను పర్యవేక్షించాల్సిన హెచ్‌డబ్ల్యూవోలకు ఏటీడీవోలుగా ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు.

**పోస్టులు భర్తీ చేయలేక..**

గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఏటీడీవో శాఖలకు రెగ్యులర్ ఏటీడీవోలు లేకపోవడంతో గిరిజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇన్‌చార్జీ ఏటీడీవోలకు అంతంత మాత్రమే అనుభవం కలిగి ఉండడంతో వసతి గృహాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఏటీడీవో పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో గిరి విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుందని పలు గిరిజన సంఘాల నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా వెంటనే పోస్టులు భర్తీ చేసి గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా చూడాలని కోరుతున్నారు.

**విద్యపై ప్రభావం**

ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రతిఏడాది వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకుని విద్యాబోధన చేస్తోంది. బోధన కొనసాగుతున్న విధానాన్ని ఏటీడీవోలు వసతిగృహాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల పర్యవేక్షణ లేకపోవడంతో పది ఫలితాలపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదని గిరిజన సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

**తూతూమంత్రంగానే తనిఖీ**

ఏటీడీవోలు వసతిగృహాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. కొందరు చుట్టం చూపులా తనిఖీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అయినా ఉన్నతాధికారులు మాత్రం అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

## యువత ఉన్నతస్థానంలో నిలవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుభాశ్

కాసిపేట(బెల్లంపల్లి): యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చదువు, క్రీడలపై దృష్టిసారించి జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని బెల్లంపల్లి అటవీ శాఖ రేంజ్ అధికారి సుభాశ్ సూచించారు. సోమవారం మండలంలోని తాటిగూడలో అటవీశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. చదువుతో మెదడుకు జ్ఞానం పెరిగినట్లు క్రీడలతో శరీరానికి, మనస్సుకు ప్రశాంతత దొరుకుతుందన్నారు. పోటీల్లో 28 జట్లు పాల్గొనడం అభినందనీయమని, క్రీడకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, ఎఫ్‌ఎస్‌వో ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలి


వినతిపత్రం ఇస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేసవికాలం మొదలైనందువల్ల ఓపెన్ కాస్ట్ గనిలో ఎండవేడిమి నుంచి తట్టుకునేందుకు ఉపశమన చర్యలు చేపట్టాలని ఐఎన్టీయూసీ నాయకులు సోమవారం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, చలువ పందిళ్లు వేయాలని, కూలర్లు ఏర్పాటు చేయాలని, ఏప్రిల్ 1 నుంచి షిఫ్టు వేళలు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి శీలం చిన్నయ్య, పిట్ సెక్రెటరీ జాన్సన్, నాయకులు కాలువ శ్రీనివాస్, ఎం.సుధాకర్, రాజశేఖర్, శ్రీను, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని తీసుకువస్తున్న గజఈతగాళ్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి పెద్దవాగులో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన హోటల్ యజమాని సెల్వరాజ్ కుమారుడు విఘ్నేష్ అలియాస్ విక్కీ (21) ఇంటర్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటూ ఏఐఈఈఈ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి మాద్యాయిగూడ సమీపంలోని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు వద్ద పెద్దవాగులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అందరూ కలిసి ఈతకొడుతుండగా విఘ్నేష్ ఒక్కసారి లోతుగా ఉన్న నీటిలోకి వెళ్లడంతో మునిగిపోయాడు. తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పోలీసులు స్థానిక జాలర్లసాయంతో రాత్రివారకు గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం గజ ఈతగాళ్లను పిలిపించి వాగులో గాలించగా మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కొడుకు కళ్ల ముందే విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

## ప్రాణదాతలుగా నిలుస్తున్న ఉద్యోగులు


సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న జీఎం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలోని ఉద్యోగులు రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారని జీఎం సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే 8 డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ జిల్లాలోని తల సేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల ప్రాణాలను కాపాడడం కోసం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీరాంపూర్ ఎంవీటీసీలో ట్రైనర్‌గా పనిచేస్తున్న రాజ్‌కుమార్ 52వసారి ఇక్కడ రక్తదానం చేయడంతో జీఎం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఎంవీటీసీ మేనేజర్ వెంకటరామారావు, డెప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్‌బాబు, రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, సభ్యులు కాసర్ల శ్రీనివాస్, రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: డీఎస్సీ (ఎస్టీటీ) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీసర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14 నుంచి 22 వరకు www. tsbcstudycircle. cgg. gov. in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. రిజర్వేషన్, ఇంటర్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. 26 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 08732–221280, 99496 84959 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు నైపుణ్యం పెంచుకోవాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): గనులలో పనిచేసే వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ వీటీసీలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. పది రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తం రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, వీటీసీ మేనేజర్ పాల్గొన్నారు.

### మూడు ఆలయాల్లో చోరీ

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని మూడు ఆలయాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఏజోన్ వెంకటేశ్వర ఆలయం, శివాలయంతో పాటు మహంకాళి ఆలయంలో దొంగలు పడి హుండీలను పగులగొట్టారు. సుమారు రూ.15 వేలు చోరీ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### మహిళా కండక్టర్‌ను వేధించిన విలేకరిపై కేసు

మంచిర్యాలక్రైం: మహిళా కండక్టర్‌ను వేధించిన ఓ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. భీమారం మండలానికి చెందిన గొల్లపెల్లి మహేష్ (ప్రముఖ పత్రికలు కాదు) కొంతకాలంగా మహిళా కండక్టర్‌ను ఫోన్ ద్వారా వేధించడం, ఆమె భర్తకు సైతం ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడడంతో ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు విలేకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

### చిరు ధాన్యాల్లో పోషకాలు పుష్కలం

బెల్లంపల్లి: సహజ సిద్ధంగా పండించే చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి అన్నారు. సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 65వ డీప్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు కోడి గుడ్లు, మాంస కృత్తులు, చేపలు, పప్పుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు విరివిగా తీసుకోవాలని సూచించారు. రక్త హీనత రాకుండా బెల్లం, నువ్వులు, పల్లీలను తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

### విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

చెన్నూర్: పట్టణానికి చెందిన ఓ విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధిత విలేకరి వెంకటరాజం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తనపై విచక్షణ రహితంగా దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బీఐఎస్ ప్రమాణాలపై అవగాహన


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

బెల్లంపల్లి: వస్తువుల కొనుగోలు విషయంలో నాణ్యత ప్రమాణాలు సూచించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్)పై సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీఐఎస్ ప్రతినిధులు కవిలత, జయశ్రీ వస్తుసామగ్రి నాణ్యత ప్రమాణాల గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల క్లబ్ ఏర్పాటు చేసి రాత పరీక్షలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్‌రెడ్డి, బీఐఎస్ మెంటార్ యాదయ్య, అధ్యాపకులు శంకర్, నాగరాజు, సురేష్, శ్రీకాంత్, హరిత, శ్రీనివాస్, మాలతి, రాజమల్లు, వెంకటస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా యువకుని మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నామానగర్ గ్రామానికి చెందిన మేడి సాయికుమార్ (17) సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక, సాయికుమార్ ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ మైనర్లే కావడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి మైనార్టీ తీరాక వివాహం చేస్తామని ఒప్పించారు. ఆదివారం రాత్రి యువతి ఇంటికి వెళ్లిన సాయికుమార్ అక్కడే ఉన్నాడు. సోమవారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్నాడని యువతి కుటుంబ సభ్యులు మృతుని తండ్రి సత్యంకు తెలుపడంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## 'సీఎం క్షమాపణ చెప్పాలి'

వేమనపల్లి(బెల్లంపల్లి): యాదాద్రిగుట్టపై బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ప్రభుత్వం తరపున వెళ్లిన డెప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను నేలపై కూర్చోబెట్టి సీఎం, ఇతర మంత్రులు, కుటుంబ సభ్యులు కుర్చీలలో కూర్చోవడం అగ్రకుల దురహంకారానికి నిదర్శనమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు కవిరి రవి, అనిల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఖర్గేను కలిసిన 'కోట్నాక'


ఢిల్లీలో ఖర్గేతో కోట్నాక తిరుపతి

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని అల్లీపూర్‌కు చెందిన ఆదివాసీ నాయకుడు కోట్నాక తిరుపతి సోమవారం ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మర్యాద పూర్వకంగా కలిశారు. రాహుల్‌తో పాదయాత్ర చేయడంతో పాటు పార్టీ అభివృద్ధి కోసం తాను చేసిన కార్యక్రమాలను ఖర్గేకు వివరించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను తనకు కేటాయించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.


### బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా పవన్‌కుమార్

పాతమంచిర్యాల: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన కట్టా పవన్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జీలుగా సిరికొండ బోస్, ఎండీ ఆదిల్ నియామకమైనట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పార్లమెంట్ ఇన్‌చార్జి కాదాసి రవీందర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నియామకాలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.

### కేసులు పరిష్కారమే లక్ష్యం

చెన్నూర్: కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యమని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. సోమవారం కోర్టు ఆవరణలో ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీ ప్రేమలత, ఏజీపీ రాంబావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్, న్యాయవాదులు పున్నం నాగులు, రాజేశ్, బ్యాంక్ మేనేజర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### 'భగీరథ' పైప్‌లైన్‌కు లీకేజీ


వృథాగా పోతున్న నీరు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ వెళ్లే దారిలో హరిహర పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో సుమారు పది మీటర్ల వరకు నీరు పైకి ఎగిసిపడింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. స్థానికులు గమనించి మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు.